# ఆదివాసీ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలి

- మారుమూల గ్రామాలకు ప్రభుత్వ సేవలు చేరాలి
- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజనా చోప్రా



2లో...




జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 13 | అక్టోబర్ | 2026 ◆ పేజీలు : 8


- పత్రికా కథనాలకు స్పందించిన కార్పొరేషన్ యంత్రాంగం!
- ఒక్క ఎంజీ రోడ్డే కాదు.. కొత్తగూడెం అంతటా ఇదే దందా?
- అనుమతుల్లేకుండానే 6 అడుగుల కట్టడం..
- అధికారుల తీరుపై పట్టణ వాసుల నిలదీత!
- వార్తలు రాస్తే జర్నలిస్టులపై కేసుల బెదిరింపులా?

# కమిషనర్ స్పందనతోనైనా.. కదలిక వస్తుందా?

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, డ్రైనేజీల కబ్జాలపై ప్రచురితమైన వరుస సంచలనాత్మక కథనాలు ఎట్టకేలకు బల్దియా అధికారుల్లో చలనం తెచ్చాయి. ఎంజీ రోడ్డులోని వాణిజ్య సముదాయంలో రూ. 6 లక్షల ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఆడిన కంటితుడుపు నాటకాలపై వెలువడిన వార్తలను కార్పొరేషన్ కమిషనర్ తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి



3లో..




## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు!

- సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**దమ్మపేట,అక్టోబర్ 12. (ప్రజాజ్యోతి):** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారుల హాజరు వివరాలను తెలుసుకోవడంతో పాటు, ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక దృష్టి**

మండలంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై

మిగతా 2 లో...

## ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

- లొంగిపోయిన వారిపై రూ.35 లక్షల రివార్డు



**చర్ల, అక్టోబర్ 12:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆరుగురు మావోయిస్టు క్యాడర్లు హింసా మార్గాన్ని విడనాడి పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఒడిశా రాష్ట్రంలో సక్రియంగా పనిచేస్తున్న నలుగురు మావోయిస్టులతో పాటు పశ్చిమ బస్తర్ డివిజన్‌కు చెందిన సంఘాన్ని విడిచి పరారీలో ఉన్న మరో ఇద్దరు ఉన్నారు. లొంగిపోయిన ఆరుగురిపై కలిపి రూ.35 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న మావోయిస్టుల లొంగుబాటు, పునరావాస విధానం, భద్రతా బలగాల నిరంతర కూంబింగ్ చర్యలు, పునరావాసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ప్రభావంతో వీరు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌జీ బీజాపూర్, కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాల (సీఆర్‌పీఎఫ్) 170వ బెటాలియన్, బీజాపూర్ పోలీసుల సమన్వయంతో ఈ లొంగుబాటు ప్రక్రియ పూర్తయింది. లొంగిపోయిన ఆరుగురిలో నలుగురు పార్టీ ప్లాటూన్ కమిటీ సభ్యులు

మిగతా 2 లో...

# ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు



(మొదటి పేజీ తరువాయి...)

(పీపీసీఎం), ఇద్దరు పార్టీ సభ్యులు (పీఎం) ఉన్నారు. రాణి సోధి అలియాస్ సంధ్య (30), పాండో పోడియం అలియాస్ సస్మిత (28), సుక్కు కుడియం అలియాస్ సంతోష్ (27), కోసా మాడ్వి అలియాస్ సతీష్ (30) పీపీసీఎం హోదాలో పనిచేశారు. వీరిలో ఒక్కొక్కరిపై రూ.8 లక్షల చొప్పున రివార్డు ప్రకటించారు.దేవే మడకం అలియాస్ జన్నీ (22) పార్టీ సభ్యురాలిగా పనిచేయగా, ఆమెపై రూ.2 లక్షల రివార్డు ఉంది. లాలు తాతి (25) పార్టీ సభ్యుడిగా పనిచేయగా, అతనిపై రూ.లక్ష రివార్డు ప్రకటించారు. ఈ విధంగా ఆరుగురిపై కలిపి రూ.35 లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.లొంగిపోయిన వారిలో కొందరు 2005 నుంచి, మరికొందరు 2012 నుంచి మావోయిస్టు సంస్థలో వివిధ హోదాల్లో పనిచేసినట్లు పోలీసుల ప్రకటనలో తెలిపారు . బాల సంఘం సభ్యులుగా ప్రారంభమైన వారి ప్రయాణం, పీఎల్‌జీఏ సభ్యత్వం, పార్టీ సభ్యత్వం నుంచి పీపీసీఎం స్థాయి వరకు కొనసాగింది. ఒడిశా రాష్ట్రంలోని వివిధ డివిజన్లు, కంపెనీల పరిధిలో వీరు పనిచేసినట్లు అధికారులు వెల్లడించారు. వీరిపై గతంలో జరిగిన పలు ఎన్‌కౌంటర్లు, పోలీసు క్యాంపులపై దాడులు, భద్రతా బలగాలపై దాడులకు సంబంధించిన సంఘటనల్లో పాల్గొన్నారనే ఆరోపణలు ఉన్నట్లు పోలీసుల వివరాలు సూచిస్తున్నాయి. వీటిలో గడ్చిరోలి, ఒడిశా ప్రాంతాలతో పాటు బస్తర్ పరిధిలో జరిగిన పలు ఘటనలు ఉన్నాయని అన్నారు మావోయిస్టు సంస్థలో నెలకొన్న అంతర్గత విభేదాలు, హింసాత్మక సిద్ధాంతంపై విరక్తి, భద్రతా బలగాల ఒత్తిడి, గతంలో లొంగిపోయిన వారి పునరావాసం, ఆదివాసీ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు తమ నిర్ణయానికి కారణమయ్యాయని అధికారులు తెలిపారు. హింసను వీడి జన జీవన స్రవంతిలో కలవాలనే ఉద్దేశంతో వారు లొంగిపోయినట్లు తెలిపారు.ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ప్రకారం వీరికి నిబంధనలకు అనుగుణంగా ఆర్థిక సహాయం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, గృహ వసతి, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించి సమాజంలో స్థిరపడేలా జిల్లా యంత్రాంగం, పోలీసులు అవసరమైన సహకారం అందిస్తారని తెలిపారు. భద్రతా బలగాల సమన్వయం, నిరంతర ప్రయత్నాలు, ప్రభుత్వ పునరావాస కార్యక్రమాలపై పెరుగుతున్న విశ్వాసం ఈ లొంగుబాటుకు దోహదపడినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

# ఆదివాసీ ప్రాంతాల్లో సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలి



**భద్రాచలం, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** ఆదివాసీ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు, మారుమూల గిరిజన గ్రామాలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి రంజనా చోప్రా అధికారులకు సూచించారు. సోమవారం వీడియో సమావేశం ద్వారా రాష్ట్రాల వారీగా గిరిజన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అమలు, ఆది సేవా కేంద్రాల ఏర్పాటు, ఆది కర్మయోగి వాలంటీర్ల గుర్తింపు, నమోదు, ఐటీడీఏల అభివృద్ధి ప్రణాళికలు, గిరిజనుల జీవనోపాధుల మెరుగుదలపై చర్చించారు. ఆది సేవా సమయ్, ఆది సేవా దిన్ కార్యక్రమాల నిర్వహణ, శిక్షణ కోర్సుల నమోదు సులభతరం, ప్రభుత్వ పథకాల సమన్వయం, రాణి దుర్గావతి ఆదివాసీ మహిళా సమ్మేళనం నిర్వహణపై పలు సూచనలు చేశారు. అర్హులైన గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా, మారుమూల ప్రాంతాల్లోనూ ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు కార్యాచరణ చేపట్టాలని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజు, పీవీటీజీ అధికారి గన్యా, సిబ్బంది కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# హోటల్స్ యజమానులు, వర్కర్ల ఐక్యతే ముఖ్యం




- ఐక్యంగా ఉంటూ సామరస్యం తోనే సమస్యలకు పరిష్కారం
- ఫుడ్ ఇండస్ట్రీలో పాల్వంచకు ప్రత్యేక స్థానం
- హోటల్స్ అసోసియేషన్ సమావేశంలో
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా
- భద్రాచలం హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి , జిందా వాసు , రాజు లు
- అఖిలపక్ష నాయకులు

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 12,(ప్రజాజ్యోతి)** హోటల్ రంగంలో పనిచేసే యజమానులు, వర్కర్ల మధ్య పరస్పర అవగాహన, సఖ్యత అత్యంత కీలకమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు స్థానిక రెస్టారెంట్లు, హోటళ్ల యాజమాన్యాలు, కార్మికులు, వివిధ పక్షాల ముఖ్య నాయకుల సమన్వయ సమావేశం సోమవారం పాల్వంచ పట్టణంలో నిర్వహించారు. కార్మికులు, యజమానులు మధ్య ఐక్యతను చాటేందుకు చేపట్టిన ఈ సమావేశం లో ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ కార్మికుల శ్రమ, యజమానుల పాత్ర రెండూ సమాన ప్రాధాన్యత కలిగినవని, ఇరువర్గాలు ఒకే కుటుంబంలా మెలగాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాణ్యమైన ఆహారం అందించడంలో పాల్వంచకు ప్రత్యేక స్థానం ఉందని, చిరు ఉద్యోగులు, కుటుంబంలో భార్యాభర్తలు ఉద్యోగులుగా ఉన్న వారికి సమయాన్ని ఆదా చేస్తూ ఒక పక్క ,మరొక పక్క వందలాది మందికి ఉపాధిని అందిస్తున్న ఫుడ్ ఇండస్ట్రీ ఇబ్బందులకు గురిచేయాలని చూస్తే పాల్వంచ ప్రాంతానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. పనిచేసే చోట ఏవైనా అభిప్రాయ భేదాలు తలెత్తితే వాటిని అంతర్గతంగా, సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలే తప్ప మూడో పక్షం జోక్యానికి ఆస్కారం ఇవ్వకూడదన్నారు. బయటి వ్యక్తుల ప్రమేయంతో అనవసర అపోహలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే అందరికీ నష్టమేనని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఎం జిల్లా నాయకులు దొడ్డ రవి కుమార్ ,సొసైటీ వైస్ చైర్మన్ కంపల్లి కనకేష్ పటేల్ బి ర్ఎస్ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, కాంగ్రెస్ నాయకులు సాదం రామకృష్ణ సిపిఐ {ఎంఎల్} న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్ , సిఐటియు జిల్లా మహిళా నాయకురాలు కే సత్య, భద్రాచలం పట్టణ హోటల్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మినీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎండి జిందా, వాసు ,రాజు లు మాట్లాడుతూ కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడుతూనే, వ్యాపారాలు సజావుగా సాగేలా రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయన్నారు. ఇలాంటి సమయాల్లో యజమానులు, వర్కర్లు సంయమనం పాటిస్తూ ఐక్యంగా ముందుకు సాగాలని వారు సూచించారు. అదేవిధంగా హోటల్ యజమాని, వర్కర్ మధ్య ఏమైనా విభేదాలు ఉంటే హోటల్స్ అసోసియేషన్ దృష్టికి తీసుకువస్తే సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు, అలా పరిష్కారం కానిపక్షంలో వర్కర్ కానీ హోటల్ యజమాని కానీ చట్ట పరంగా పోవాలి కానీ మూడో వ్యక్తి ప్రవేశానికి అవకాశం ఇవ్వరాదన్నారు, సమావేశ అనంతరం త్వరలో హోటల్ అసోసియేషన్ నూతన కమిటీతోపాటు, వర్కర్ల యూనియన్ను ఏర్పాటు చేయనున్నట్లు హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేసంశెట్టి విశ్వేశ్వర రావు ఈ సందర్భంగా తెలిపారు, ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, హోటల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గాడేపల్లి వీరభద్రం, పాపోలు నాగేశ్వరరావు, సంక్రాంతి రవి, నాగవేణి, ఆవుల శ్రీను, ఎండి కాజా, రెడ్డి, ఎస్ ఆర్ రెడ్డి, కృష్ణ, చందు మునునూరి వాసు, వీరభద్రం అక్కినేని శ్రీను , బి హోటల్ కార్మికులు కార్మికులు వెంకటేశ్వర్లు, రమేష్, శ్రీనివాస్, కాసింబి, శశి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టొద్దు!

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా, చెరువుల్లో నీటి నిల్వలు, వ్యవసాయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మిషన్ భగీరథ అధికారులను తాగునీటి సరఫరా వివరాలు అడిగి తెలుసుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**230 చెరువుల నీటి నిల్వలపై సమీక్ష**

మండలంలోని 230 చెరువుల్లో నీటి నిల్వల పరిస్థితిని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే నీటి నిల్వలు తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. చెరువుల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.

**రైతులకు అవసరమైన సూచనలు అందించాలి**

రైతు వేదికల్లో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాలకు హాజరవుతున్న రైతుల సంఖ్య, వారికి అందిస్తున్న సలహాలు, సూచనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా రైతులకు తగిన సూచనలు అందించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ప్రణాళికపై అవగాహన కల్పించాలని సూచించారు.

**అటవీ–రెవెన్యూ సంయుక్త సర్వేలు వేగవంతం చేయాలి**

అటవీశాఖ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంయుక్త సర్వేలు, భూ




రీసర్వే పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత విధానాల ప్రకారం సర్వేలను చేపట్టాలని సూచించారు. సర్వేలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**మండల ప్రజావాణిపై విస్తృత ప్రచారం**

మండల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు తక్కువ సంఖ్యలో హాజరవుతున్న అంశంపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రతి వారం ఎంత మంది దరఖాస్తుదారులు వస్తున్నారు? మండల స్థాయిలో పరిష్కరించగల సమస్యల కోసం ప్రజలు జిల్లా కేంద్రంలోని ప్రజావాణికి ఎందుకు వెళ్తున్నారు? అనే వివరాలను ఎంపీడీవో రవీందర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మండల ప్రజావాణి కార్యక్రమంపై గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, యువత సహకారంతో సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను మండల స్థాయిలోనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో దమ్మపేట తహసీల్దార్ డిప్యుటి కలెక్టర్ మురళి, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- పత్రికా కథనాలకు స్పందించిన కార్పొరేషన్ యంత్రాంగం!
- ఒక్క ఎంజీ రోడ్డే కాదు.. కొత్తగూడెం అంతటా ఇదే దందా?
- అనుమతు ల్లేకుండానే 6 అడుగుల కట్టడం..
- అధికారుల తీరుపై పట్టణ వాసుల నిలదీత!
- వార్తలు రాస్తే జర్నలిస్టులపై కేసుల బెదిరింపులా?

# కమిషనర్ స్పందనతోనైనా.. కదలిక వస్తుందా?



**కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, డ్రైనేజీల కబ్జాలపై ప్రచురితమైన వరుస సంచలనాత్మక కథనాలు ఎట్టకేలకు బల్దియా అధికారుల్లో చలనం తెచ్చాయి. ఎంజీ రోడ్డులోని వాణిజ్య సముదాయంలో రూ. 6 లక్షల ముడుపులు చేతులు మారాయనే ఆరోపణలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఆడిన కంటితుడుపు నాటకాలపై వెలువడిన వార్తలను కార్పొరేషన్ కమిషనర్ తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది.**

● భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ప్రజాజ్యోతి

సదరు ఆక్రమణపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదికను అందజేయాలని ఆదేశించారు. అయితే ఈ స్పందన కేవలం కాగితాలకే పరిమితమవుతుందా లేక క్షేత్ర స్థాయిలో అక్రమ కట్టడాలను కూల్చివేసి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటారా అనేది వేచి చూడాలి.

**అనుమతిలేకుండానే.. 6 అడుగుల కట్టడం!**

ఈ అక్రమ నిర్మాణ వ్యవహారంలో ఇప్పుడు కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎంజీ రోడ్డులో వివాదంలో ఉన్న సదరు పాత భవనానికి కోర్టు కేసుల ప్రక్రియ పూర్తయి సుమారు ఆరు నెలల కిందట యజమానికి స్వాధీనమైంది. అయితే మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు (ప్లాన్ పర్మిషన్) తీసుకోకుండానే, "పాత భవనానికి చిన్నపాటి రీ–మోడలింగ్ చేసుకుంటాను" అని మౌఖికంగా చెప్పి పనులు ప్రారంభించారు. పాత భవనం పునర్నిర్మాణం ముసుగులో ఏకంగా ఎంజీ రోడ్డు లాంటి ప్రధాన మార్గంలో సుమారు 6 అడుగుల మేర ముందుకు వచ్చి, మురుగునీటి పారిశుధ్యానికి అత్యంత కీలకమైన ప్రధాన డ్రైనేజీని పూర్తిగా కమ్మేస్తూ నిర్మాణం చేపట్టారు. పట్టపగలే ఇంత పెద్ద ఎత్తున డ్రైనేజీని కబ్జా చేస్తుంటే టౌన్ ప్లానింగ్ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మర్మమేమిటో ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోంది.

**పట్టణమంతా వ్యాపించిన ఆక్రమణల వ్యాధి!**

నిజానికి ఈ అక్రమ నిర్మాణాల జాడ్యం కేవలం ఒక్క ఎంజీ రోడ్డుకే పరిమితం కాలేదు. కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడళ్లు, బస్టాండ్ సెంటర్, పోస్ట్ ఆఫీస్ ఏరియా, చిన్న బజార్, పెద్ద బజార్, లక్ష్మీదేవిపల్లి మార్గం, పాత కొత్తగూడెం ప్రాంతాల్లోనూ అనేక చోట్ల ఫుట్‌పాత్‌లు, మురుగునీటి కాలువలు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ప్రజా వినియోగానికి కేటాయించిన స్థలాలు, పాదచారుల నడక మార్గాలు ఆక్రమణదారుల చేతుల్లో బందీ అవుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు మౌనం వహించడం వెనుక పెద్ద ఎత్తున మామూళ్ల దందా నడుస్తోందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**విలేకరులపై కేసుల బెదిరింపులా?**

ఈ అక్రమ నిర్మాణాలు ప్రారంభమయ్యే పునాది దశలోనే పర్యవేక్షించి అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ సమయంలో కళ్లు మూసుకుని, నిర్మాణాలు పూర్తయ్యాక కొలతల నాటకాలు ఆడటం ఏ రకమైన విధి నిర్వహణో అర్థం కావడం లేదు. అధికారులు మొదట్లోనే ముందస్తు పర్యవేక్షణ చేపడితే ఈ ఆక్రమణల వ్యవస్థే ఉండదు కదా అని పాట్న వాసులు చర్చించుకుంటూన్నారు. ఇక అన్నింటికంటే దారుణమైన విషయమేమిటంటే.. ప్రజా సమస్యలను, అధికారుల అలసత్వాన్ని ఎండగడుతూ వార్తా కథనాలు రాస్తున్న విలేకరులపై చట్టపరమైన కేసులు పెడతామని కొందరు అధికారులు బహిరంగంగా బెదిరింపులకు దిగడం సర్వత్రా నిరసనలకు దారితీస్తోంది. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే ప్రజా సేవకులుగా ఉంటూ, ప్రశ్నించే జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం వారి బాధ్యతా రాహిత్యానికి అద్దం పడుతోంది.

**కఠిన చర్యలు ఎప్పుడు?**

'ప్రజా జ్యోతి' వరుస కథనాల నేపథ్యంలో కార్పొరేషన్ కమిషనర్ స్పందించి విచారణకు ఆదేశించడం ఆహ్వానించదగిన పరిణామమే. అయినప్పటికీ, కేవలం నివేదికలతో సరిపెట్టకుండా క్షేత్రస్థాయిలో కఠిన నిర్ణయాలు అమలు చేయాలి. ఎంజీ రోడ్డు డ్రైనేజీపైకి వచ్చిన అక్రమ నిర్మాణాన్ని తక్షణమే పక్కాగా కొలతలు వేసి పూర్తిగా తొలగించాలి. అనుమతి లేని రీ–మోడలింగ్ పేరిట ఆక్రమణ జరుగుతున్న సమయంలో కాలయాపన చేస్తూ యజమానికి సహకరించిన అధికారులపై శాఖాపరమైన విచారణ జరిపించాలి. కొత్తగూడెం వ్యాప్తంగా ఉన్న ఆక్రమణలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ముందస్తు నిరోధక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. విధి నిర్వహణలోని లోపాలను కప్పిపుచ్చుకునేందుకు విలేకరులను బెదిరించే అధికారుల ధోరణిపై కూడా ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించినప్పుడే ప్రజా ప్రయోజనాలకు రక్షణ లభిస్తుంది.

**ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని పాదచారుల ప్రయాణం!**

కొత్తగూడెం పట్టణంలో పార్కింగ్ వ్యవస్థ పూర్తిగా మృగ్యమైంది. నేషనల్ హైవే (జాతీయ రహదారి) పరిధిలో ఉన్న పెద్ద పెద్ద వాణిజ్య భవనాలు, సముదాయాలకు కనీస పార్కింగ్ స్థలాలు కేటాయించకపోవడం కార్పొరేషన్ అధికారుల అలసత్వానికి నిదర్శనం. ఒకవైపు భవనాలకు పార్కింగ్ లేక పోవ డంతో వాహనాలన్నీ రోడ్డు పక్కనే నిలుపుతుండగా, మరోవైపు ఉన్న అరకొర ఫుట్‌పాత్‌లను వ్యాపారులు, ఆక్రమణదారులు కబ్జా చేస్తున్నారు. దీంతో సాధారణ పౌరులు, చిన్న పిల్లలను పట్టుకుని నడిచే తల్లులు నడిరోడ్డుపైనే ప్రయాణించాల్సిన దారుణ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో వెనుక నుంచి ఏ వేగవంతమైన వాహనం వచ్చి ఢీకొడుతుందోనని భయపడుతూ, అటూ ఇటూ చూసుకుంటూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని నడవాల్సి వస్తోంది. ఇలాంటి ప్రాణసంకటం పరిస్థితులు అధికారులకు కనిపించడం లేదా అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఎవరినీ ఉపేక్షించం : సుజాత (కార్పోరేషన్ కమిషనర్)

"ఎంజీ రోడ్డు భవన నిర్మాణానికి సంబంధించి యజమానుల వద్ద ఏమేమి కాగితాలు, పత్రాలు ఉన్నాయో తక్షణమే ఆఫీస్ కు తీసుకురావాలని ఆదేశించాం. వారు సమర్పించే ఆధారాలన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తాం. అధికారుల అనుమతులు, కనీస అర్హత లేనిదే కొత్తగా ఏమైనా నిర్మాణం చేపట్టినట్లు తేలితే.. ఆ కొత్తగా కట్టిన అక్రమ నిర్మాణాన్ని మొత్తం కచ్చితంగా కూల్చివేస్తాం. ఆక్రమణల విషయంలో ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదు. ముఖ్యంగా కొత్తగూడెం పట్టణ వ్యాప్తంగా ఉన్న ప్రధాన డ్రైనేజీల ఆక్రమణలపై రాబోయే రోజుల్లో మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటాం."



## అర్హులైన గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించాలి

- నిర్ణీత గడువులోగా దరఖాస్తుల పరిష్కారం
- భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్



**భద్రాచలం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ఆశతో అర్జీలు సమర్పించే అర్హులైన గిరిజన కుటుంబాలకు అన్ని విధాలా న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం భద్రాచలం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల సమస్యలను అధికారులు స్వీకరించారు. పోడు భూముల పట్టాల ఆన్‌లైన్ నమోదు, పేర్ల మార్పులు, భూ సమస్యలు, చేపల సంఘాల ఏర్పాటు, స్వయం ఉపాధి శిక్షణ, వ్యవసాయానికి విద్యుత్, బోర్లు, మోటార్లు, గ్రామాల్లో విద్యుత్ సదుపాయాలు కల్పించాలని పలువురు అర్జీలు సమర్పించారు. దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సహాయం, సోలార్ పథకం ద్వారా బోరుబావులకు విద్యుత్ సౌకర్యం, ఉన్నత విద్యకు ఆర్థిక తోడ్పాటు అందించాలని గిరిజనులు కోరారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అర్హులైన వారికి విడతలవారీగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పీఓ తెలిపారు.

## ఆదిలక్ష్మి అలంకారంలో దర్శనమిస్తున్న లక్ష్మీ అమ్మవారు

- దసరా ఉత్సవాల్లో భక్తులకు విశేష దర్శనం



**భద్రాచలం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో దసరా ఉత్సవాలు భక్తిభావంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం లక్ష్మీ అమ్మవారు ఆదిలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆదిలక్ష్మి రూపంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. అమ్మవారి కృపతో సకల శుభాలు, ఐశ్వర్యం కలగాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది.

## యువత క్రీడారంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 12, (ప్రజాజ్యోతి)** నేటి యువత క్రీడారంగంలో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాల్వంచ సొసైటీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణ పరిధిలోని 45వ డివిజన్ లోని ముజిందర్ ఎస్టేట్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వరుణ్ స్కేటింగ్ అండ్ కరాటే అకాడమీని సోమవారం కొత్వాల ప్రారంభించారు. అకాడమీ డైరెక్టర్ ఏదుకొండలు యాదవ్ ని ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ చిన్నారులు, యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడములో కరాటే, స్కేటింగ్ వంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పించేలా కృషి చేయాలని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ తడకమల్ల ప్రణీత్, కార్పొరేటర్లు డాక్టర్ బి.ఎస్ రావు , కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, బానోత్ బాలునాయక్, దంతెబోయిన నరేష్, సీరపు సుగుణ, ఖమ్మం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్కేటింగ్ కోచ్ కె. సురేష్, ప్రముఖ వైద్యులు సునీల్, కిరణ్, ముజిందర్ ఎస్టేట్ యజమాని దీపక్, కరాటే మాస్టర్ డి. వాసు, తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ, పీజీ ప్రవేశాలకు నేడు చివరి గడువు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.జాన్ మిల్టన్



**భద్రాచలం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా డిగ్రీ, పీజీ కోర్సుల్లో నూతన ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు అక్టోబర్ 13వ తేదీలోగా అనగా నేటితో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసి, ప్రవేశ రుసుము చెల్లించాలని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.జాన్ మిల్టన్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధ్యయన కేంద్ర సమన్వయకర్త కిరణ్ కుమార్ సూచించారు. ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రాన్ని 6301775925, 7382929639, 9949581467 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## కొత్తగూడెంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఏడో మహాసభలు

- మహాసభల ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**భద్రాచలం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఏడో మహాసభలను డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో కొత్తగూడెంలో మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మహాసభల ప్రచార బ్రోచర్‌ను భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులను సమీకరించి మహాసభలను విజయవంతం చేసేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగ అభివృద్ధి, విద్యా వ్యవస్థ బలోపేతం తదితర అంశాలపై మహాసభల్లో చర్చించనున్నారు. ఈ మహాసభలకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు గౌరవ సలహాదారుగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్, జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, నాయకులు పి. లక్ష్మీనారాయణ, రాజా శ్రీనివాస్, అనిల్ కుమార్, భద్రాచలం మండల ప్రధాన కార్యదర్శి పి.ఎస్.వి. ప్రసాద్ బాబు, దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు ఏ. వెంకట్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- గాంధీ పథం ఆధ్వర్యంలో నిరసన...
- ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు పిలుపు



**భద్రాచలం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అంతర్జాతీయ గాంధీ పథం అధ్యక్షుడు డా. బూసిరెడ్డి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో భద్రాచలంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, గాంధీ పథం చేపడుతున్న ఉద్యమాన్ని మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విస్తరించి, ప్రజలను భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. భద్రాచలం నియోజకవర్గంలోని ప్రతి వార్డులో గాంధీ పథం కమిటీలను ఏర్పాటు చేసి, రాహుల్ గాంధీ చేపడుతున్న ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. అంతర్జాతీయ గాంధీ పథం అధ్యక్షుడు డా. బూసిరెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయి వరకు కమిటీలను విస్తరించి, ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ పథం డివిజనల్ కన్వీనర్ తాండ్ర నరసింహారావు, జిల్లా సభ్యుడు హనుమంతు, మండల అధ్యక్షుడు గంజి సంపత్, రామచంద్ర, రాము, మల్లేష్ రెడ్డి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును కలిసిన నూతన సీఐ సట్ల రాజు

- శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఎమ్మెల్యే వెంకటరావు

**భద్రాచలం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** భద్రాచలం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని ఎమ్మెల్యే వెంకట్రావు నూతన సీఐ సట్ల రాజుకి తెలిపారు. ఇటీవల భద్రాచలం పట్టణ నూతన సిఐ గా బాధ్యతలు స్వీకరించిన సట్ల రాజు సోమవారం స్థానిక ఎమ్మెల్యే వెంకటరావుని వారి క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల మొక్కను అందజేశారు. పట్టణంలో



శాంతిభద్రతల పరిస్థితులు, ప్రజా సమస్యలు, పోలీసు శాఖ చేపట్టాల్సిన చర్యలపై ఇరువురూ చర్చించారు. నూతన సీఐ బాధ్యతల స్వీకరణ నేపథ్యంలో జరిగిన ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

# కరకట్టతో మత్స్యకారుల జీవనాధారానికి గండి!

- కొల్లు చెరువుపై నిర్మాణాన్ని నిలిపివేయాలి..
- ఫిషరీస్ పాలసీ ప్రకారం న్యాయం చేయాలని కలెక్టరేట్ ప్రజావాణిలో వినతి



**బూర్గంపహాడ్, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ గ్రామ పరిధిలోని కొల్లు చెరువుపై ప్రభుత్వం నిర్మిస్తున్న కరకట్ట తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తూ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం (రిజి. నెం. 6) సభ్యులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు.కరకట్ట నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని, లేనిపక్షంలో నష్టపోతున్న మత్స్యకార కుటుంబాలకు ఫిషరీస్ పాలసీ ప్రకారం నష్టపరిహారం చెల్లించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

**45 మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి ప్రశ్నార్థకం!**

బూర్గంపహాడ్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 136లో ఉన్న కొల్లు చెరువుపై సుమారు 45 మత్స్యకార కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని సంఘం సభ్యులు తెలిపారు.తరతరాలుగా చేపల పెంపకం,చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్న తమకు చెరువుపై కరకట్ట నిర్మాణం ఇబ్బందికరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.నిర్మాణం కారణంగా చేపల పెంపకానికి,నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడితే తమ ఉపాధి దెబ్బతినడంతో పాటు కుటుంబాల ఆర్థిక పరిస్థితి కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.కరకట్ట నిర్మాణం వల్ల చెరువులో చేపల పెంపకానికి,నీటి ప్రవాహానికి కలిగే ప్రభావాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని మత్స్యకారులు కోరారు. సంబంధిత నిర్మాణ శాఖ అధికారులతో పాటు మత్స్యశాఖ అధికారులను భాగస్వామ్యం చేస్తూ సంయుక్త సర్వే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకారుల జీవనోపాధికి నష్టం కలగకుండా నిర్మాణ పనులకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సూచించారు.

**ఫిషరీస్ పాలసీ ప్రకారం పరిహారం చెల్లించాలి**

ప్రజాప్రయోజనాల దృష్ట్యా చేపట్టే నిర్మాణ పనుల వల్ల సంప్రదాయ వృత్తిపై ఆధారపడిన కుటుంబాలు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. కరకట్ట నిర్మాణాన్ని నిలిపివేసి సమస్యకు పరిష్కారం చూపాలని,అది సాధ్యం కాని పక్షంలో నష్టపోతున్న మత్స్యకార కుటుంబాలకు వర్తించే నిబంధనలు, ఫిషరీస్ పాలసీ ప్రకారం నష్టపరిహారం అందించాలని కోరారు. తమ సమస్యను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బూర్గంపహాడ్ ఉపసర్పంచ్ గుండె వెంకన్న,మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు గుండె నరసింహారావుతో పాటు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ డి.వేణుగోపాల్





**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 12,(ప్రజాజ్యోతి)**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ పద్మావతి, ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, హౌసింగ్ పిడి సవేరామ్ తో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలుస్తోందన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు, జిల్లా కేంద్రంతో పాటు మండల స్థాయిలోని ఎంపీడీవో కార్యాలయాల్లో కూడా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ప్రజావాణిలో వచ్చిన కొన్ని వినతులు**

అశ్వాపురం మండలం నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి నిధులు దుర్వినియోగం చేసినందుకు అతనిని తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గుండాల మండలం కొడవ దంచ గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను నివారించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, మణుగూరు మండలం అజయ్ నగర్ గ్రామానికి చెందిన చిట్టిమల్ల శిరీష అంగన్వాడి టీచర్ ఉద్యోగానికి రెసిడెన్షియల్ సర్టిఫికెట్ సమర్పించనందున విచారణ జరిపి న్యాయం చేయాలని, మణుగూరు మండలం రామానుజవరం గ్రామపంచాయతీ మల్లేపల్లి గ్రామానికి చెందిన తడికల ఆకాంక్ష అంగనవాడి టీచర్ ఉద్యోగానికి మెరిట్ ఉన్న ఇంటర్వ్యూలో ఎంపిక చేయలేదని కోరిన వినతి పత్రాలను అధికారులకు అందజేశారు, వీటిని తక్షణమే పరిష్కరించాలని జెసి వివిధ శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు, ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలలో బెల్ట్ షాపుల దందా

- గ్రామీణ ప్రాంతాలలో బెల్ట్ షాపులు బార్ షాపులా అవతారం ఎత్తుతున్న పట్టించుకునే వారే లేరు
- సంబంధిత ఎక్సైజ్ శాఖ నిద్రిస్తుందా ?బెల్ట్ షాపులో ఎంఆర్పి కంటే ₹60 అధికంగా మద్యం విక్రయం చర్యలు ఏవి?
- ఎక్సైంజ్ శాఖ తీరుపై మండిపడ్డ సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్



- గ్రీవెన్స్ డే లో ఎక్సైజ్ ఉన్నతాధికారులపై కలెక్టరుకు ఫిర్యాదు

**లక్ష్మీదేవి పల్లి ,12 అక్టోబర్ ,ప్రజా జ్యోతి:** జిల్లాలోని పలు మండలాల్లో బెల్ట్ షాపులకు అక్రమంగా మద్యం తరలిస్తూ, ఎంఆర్పీ కంటే రూ.30 నుంచి రూ.60 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, చంద్రుగొండ మండలాల్లో కొందరు మద్యం దుకాణాల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి గ్రామీణ ప్రాంతాల్లోని బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్నారని ఆరోపించారు. అధిక ధరల వసూళ్లతో సామాన్యులు, పేద ప్రజలపై ఆర్థిక భారం పడటంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు, గృహహింస పెరుగుతున్నాయని పేర్కొన్నారు. లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి మండలాల్లో ఆటోల ద్వారా గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారని, ఫిర్యాదులు చేసినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ జరిపించి, అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బాదావత్ అనిల్ కుమార్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూఖ్య హరీష్ నాయక్, జిల్లా కార్యదర్శి ధరావత్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు

# రవిచంద్ర హత్య కేసులో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి

- హత్యకు సహకరించిన వారి పైన కేసు నమోదు చేయాలి..
- జిల్లా సేవా లాల్ విద్యార్థి సంఘం నాయకులు సైదా నాయక్

**బూర్గంపహాడ్, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం కలవలనాగారం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు బాదావత్ రవిచంద్ర హత్యకు కారకులైన వారిని పోలీసులు తక్షణమే గుర్తించి అరెస్టు చేయాలని సేవాలాల్ విద్యార్థి సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్ డిమాండ్ చేశారు.ఈ దారుణ ఘటనకు పాల్పడిన వారితో పాటు, హత్యకు సహకరించిన వారెవరైనా సరే వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా సైదా నాయక్ మాట్లాడుతూ.. గ్రామంలో అందరితో స్నేహపూర్వకంగా మెలిగే అమాయక గిరిజన యువకుడు రవిచంద్రను ఇంటి వద్ద నుంచి పథకం ప్రకారం తీసుకెళ్లి హత్య చేసి అటవీ ప్రాంతంలో పడవేసినట్లు ఆరోపించారు.ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపిందని,ఒక యువకుడి ప్రాణాలను ఇంత దారుణంగా తీసుకోవడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు.గుర్తుతెలియని వ్యక్తులు బెల్టుతో గొంతు బిగించి హత్య



చేసినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీయాలని కోరారు.

**నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలి**

రవిచంద్ర హత్య వెనుక ఉన్న కారణాలను,ఘటనకు పాల్పడిన వ్యక్తులను,వారికి సహకరించిన వారి పాత్రను పోలీసులు సమగ్రంగా విచారించాలని సైదా నాయక్ డిమాండ్ చేశారు.పలుకుబడి ఉన్నవారైనా, మరెవరైనా నేరంలో భాగస్వాములైనట్లు తేలితే చట్టపరమైన చర్యలకు వెనుకాడకూడదన్నారు.దర్యాప్తులో ఎలాంటి రాజకీయ,ఇతర ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించి,బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

**బాధిత కుటుంబానికి అండగా సేవాలాల్ సేన**

బాదావత్ రవిచంద్ర కుటుంబానికి న్యాయం జరిగే వరకు సేవాలాల్ సేన అండగా ఉంటుందని సైదా నాయక్ భరోసా ఇచ్చారు.నిందితులను తక్షణమే అరెస్టు చేయకపోతే సేవాలాల్ సేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.గిరిజన యువకుడి హత్య ఘటనలో నిజానిజాలను వేగంగా వెలికితీసి,బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలని ఆయన పోలీసు శాఖను కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పేద విద్యార్థులకు శ్రీ వాసవి ఆర్యవైశ్య విద్య , వివాహ సహాయ ట్రస్ట్ చేయూత



**కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ / అక్టోబర్ 12,(ప్రజాజ్యోతి)** ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా శ్రీ వాసవి ఆర్యవైశ్య విద్యా వివాహ సహాయ ట్రస్ట్ ఆధ్వర్యంలో 47 మంది పేద ఆర్యవైశ్య విద్యార్థినీ, విద్యార్థులకు చదువు, వివాహ సహాయం నిమిత్తం మొత్తం రూ. రెండు లక్షల 50 వేల రూపాయలను ఆర్థిక సహాయం చేశారు, సోమవారం వాసవి భవన్లో జరిగిన కార్యక్రమంలో పేద విద్యార్థులైన డాక్టర్, ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్, 10వ తరగతి, 9వ తరగతి, 7వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉన్నారు. అదేవిధంగా కొత్తగూడెంకు చెందిన ఒక నిరుపేద ఆర్యవైశ్య యువతికి వచ్చే నెలలో వివాహం కుదిరిన సందర్భంగా ఆమెకు కూడా వివాహ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు, ఈ సందర్భంగా పలువురు ట్రస్టు నాయకులు మాట్లాడుతూ ఈ ట్రస్ట్ 2012 సంవత్సరంలో శ్రీ చారుగుండ్ల దేవి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించబడిందన్నారు, అప్పటి నుండి నిరంతరం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రూ జోన్ క్లీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల భవాని సురేష్, డా. తాడికొండ ప్రవీణ్ కుమార్, పాల్వంచ చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలవాది ప్రకాష్ తో పాటు వంకదార నరసింహం కుమార్ వ్యాఖ్యాత గా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కమిటీ సభ్యులు – ప్రధాన కార్యదర్శి చిల్లంచర్ల గిరిధర్, కోశాధికారి మిట్టపల్లి నరసింహారావు, కార్యనిర్వహణ కార్యదర్శి షేగు జనార్ధన్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర మహిళా వైస్ ప్రెసిడెంట్ పెండ్యాల రోజాలక్ష్మి , కంటాల వెంకటేశ్వరరావు, పసుమర్తి నాగేశ్వరరావు, గూడెపు శ్రీనివాస్, నల్లమల్లి లక్ష్మణమూర్తి, సంకా రవికుమార్, ధారా నరసింహారావు, కందే ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదుట దసరా సందడి

- కేరళ తరహా డప్పు వాయిద్యాలు, టెడ్డీబేర్ వేషధారణతో ఆకట్టుకున్న కళాకారులు




**చుంచుపల్లి, అక్టోబర్ 12(ప్రజాజ్యోతి ):** దసరా పండుగను పురస్కరించుకుని బాబుక్యాంప్ లోని సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదుట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పండుగ షాపింగ్ కోసం మాల్‌కు వస్తున్న వినియోగదారులను ఆకట్టుకునేలా నిర్వాహకులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కేరళ సంప్రదాయాన్ని ప్రతిబింబించే డప్పు వాయిద్యాల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కళాకారులు సమన్వయంతో డప్పులు వాయిస్తూ ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. వాయిద్యాల శబ్దాలతో మాల్ పరిసరాలు మార్మోగుతుండగా, షాపింగ్‌కు వచ్చిన ప్రజలు కొద్దిసేపు అక్కడే నిలిచి ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షిస్తున్నారు. పండుగ సందర్భంగా మాల్ వద్ద ఏర్పాటు చేసిన అలంకరణలు, ప్రత్యేక కార్యక్రమాలు సందర్శకులకు దసరా ఉత్సాహాన్ని మరింత పెంచుతున్నాయి. అదేవిధంగా టెడ్డీబేర్ వేషధారణలో ఉన్న కళాకారులు చిన్నారులను ప్రత్యేకంగా ఆకర్షిస్తున్నారు. వారితో ఫొటోలు దిగేందుకు పిల్లలు, కుటుంబ సభ్యులు ఆసక్తి చూపుతున్నారు. టెడ్డీబేర్ పాత్రధారులు సందర్శకులతో సరదాగా మమేకమవుతూ చిన్నారుల్లో ఆనందాన్ని నింపుతున్నారు. దీంతో మాల్ ఎదుట సందడి వాతావరణం నెలకొంది. దసరా పండుగను పురస్కరించుకుని వినియోగదారులకు షాపింగ్‌తో పాటు వినోదాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పండుగ రోజుల్లోనూ ఇలాంటి సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎదుట ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక ఆకర్షణలు స్థానికులు, సందర్శకుల ప్రశంసలు అందుకుంటున్నాయి.

# ఏఐకేఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా





- కొత్తగూడెం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి
- పాలకుల నిర్లక్ష్యంతో వ్యవసాయం సంక్షోభం
- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 12 ,(ప్రజాజ్యోతి)** కొత్తగూడెం జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి, నష్టపోయిన అన్నదాతలకు ఎకరాకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ఏఐకేఎస్ ఆధ్వర్యంలో రైతులు భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్కు అందజేశారు ,ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు గిట్టుబాటు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలన్నారు. అర్హులైన పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వడంతో పాటు, కౌలు రైతులకు అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలని కోరారు. వ్యవసాయానికి పగటిపూటే నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, పెండింగ్ ప్రాజెక్టుల కాల్వల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతాంగాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.15 వేల చొప్పున ఎలాంటి కోతలు విధించకుండా రైతులందరికీ అందించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీని ఏకకాలంలో పూర్తి స్థాయిలో వర్తింపజేసి అన్నదాతలను రుణవిముక్తులను చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు సమగ్ర పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, సలిగంటి శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, వై ఎస్ గిరి,వాడే లక్ష్మి . అమ్మటం సురేష్. ఇట్టి వెంకట్రావు గుర్రం వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు వేములపల్లి శ్రీనివాసరావు కారె గట్టు సర్పంచ్ బాబురావు కోరం శేఖర్ వజ్జా వాసు. బాదావత్ శ్రీనివాసరావు జర్పల కిషన్ బానోత్ రంజిత్ కోటి నాగేశ్వరరావు సాయిలి వెంకన్న అయిలపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నక్సలైట్ల ఆయుధాల డంప్ స్వాధీనం

- 13 ఆయుధాలు, 208 డిటోనేటర్లు, పేలుడు పదార్థాలు స్వాధీనం




**చర్ల, అక్టోబర్ 12: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో నక్సలైట్ల నిర్మూలన చర్యల్లో భాగంగా భద్రతా దళాలు కీలక విజయాన్ని సాధించాయి. కిస్తారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలచల్మా గ్రామ సమీపంలోని మారుమూల కొండలు, అటవీ ప్రాంతంలో నక్సలైట్లు గతంలో దాచిపెట్టిన ఆయుధాల డంప్‌ను సంయుక్త బృందం గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఈ డంప్ నుంచి 13 ఆయుధాలు, 46 లైవ్ రౌండ్లు, 208 నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, పేలుడు పదార్థాలు, కమ్యూనికేషన్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.సుక్మా జిల్లా ఎస్పీ మయాంక్ గుర్జర్, అదనపు ఎస్పీ (నక్సల్ ఆపరేషన్స్) రోహిత్ షా మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్ల నుంచి అందిన కీలక సమాచారంతో జిల్లా పోలీసు దళం, జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), బస్తర్ ఫైటర్స్‌తో కూడిన సంయుక్త బృందం అక్టోబర్ 12న పలచల్మా అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో అనుమానిత ప్రాంతాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా, గతంలో నక్సలైట్లు దాచిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి బయటపడింది.

**స్వాధీనం చేసుకున్న సామగ్రి వివరాలు:**

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం రెండు .303 రైఫిళ్లు, ఒక సింగిల్ షాట్ ఆయుధం, నాలుగు బీజీఎల్ లాంచర్లు, మూడు 12 బోర్ రైఫిళ్లు, రెండు భర్మర్ తుపాకులు, ఒక దేశీయ పిస్టల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 26 లైవ్ రౌండ్లతో కూడిన మూడు ఇన్సాస్ మ్యాగజైన్లు, 20 12 బోర్ లైవ్ రౌండ్లు, ఒక ఆరో బాంబు, రెండు బీజీఎల్ సెల్స్, ఒక వైర్‌లెస్ సెట్, రెండు వైర్‌లెస్ ఛార్జర్లు, 208 నాన్ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, ఒక మ్యాగజైన్ పౌచ్‌ను స్వాధీనం చేసుకున్నారు.అలాగే .303 రైఫిల్‌కు చెందిన రెండు ఖాళీ షెల్స్, ఇన్సాస్ రైఫిల్‌కు చెందిన రెండు ఖాళీ షెల్స్, ఏకే–47 రైఫిల్‌కు చెందిన మూడు ఖాళీ తూటాలు, 12 బోర్ రైఫిల్‌కు చెందిన రెండు ఖాళీ తూటాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా దళాలు సురక్షితంగా జప్తు చేశాయని చట్ట ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నాయని పోలీసులు తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు మారుమూల అటవీ, కొండ ప్రాంతాల్లో ఏరియా డామినేషన్, గాలింపు చర్యలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. నక్సలైట్లు గతంలో దాచిపెట్టిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి, పేలుడు పదార్థాల నిల్వల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, నక్సల్ నిర్మూలనలో భాగంగా ఇటువంటి ఆపరేషన్లు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఇందిరమ్మ ఇళ్లు

- ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన పర్స వెంకట్



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 12, (ప్రజాజ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలం వెంకటాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పర్స వెంకట్ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన మడి రాజు, మడి గీత, మడి కృష్ణ, మడి విజయల ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించి, గృహప్రవేశాలు చేయించారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల నెరవేరడం ఆనందకరమని పేర్కొన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి భరోసానిస్తుందని తెలిపారు. అనంతరం ఇంటి యజమానులు పర్స వెంకట్‌ను అభినందించి సన్మానించారు. తమ సొంతింటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, అశ్వారావుపేట శాసనసభ్యుడు జారే ఆదినారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు చింతం నరసింహారావు, పూర్ణచంద్రరావు, వడ్డెబోయిన చెన్నారావు, గుగులోత్ సాయిరాం, అమరబాదు శ్రీను, చల్ల లక్ష్మణరావు, కురసం శివ, కురసం బాలకృష్ణ, కుంజా రవి, కురసం సుబ్బారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీలు నిలిపివేయాలి





- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మహా ధర్నా

**చర్ల, అక్టోబర్ 12:(ప్రజా జ్యోతి):** భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు ఇసుక లారీల రాకపోకలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చర్ల మండల బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహా ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, భద్రాచలం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానే రామకృష్ణ ఆదేశాల మేరకు మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు రహదారిపై ఇసుక లారీల రాకపోకల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కారణంగా ఎగసిపడుతున్న ఇసుక ధూళితో ప్రజలు అలర్జీలు, శ్వాసకోశ సమస్యలకు గురవుతున్నారని ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ భద్రాచలం నుంచి వెంకటాపురం వరకు ప్రయాణిస్తే ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అర్థమవుతాయని విమర్శించారు. భద్రాచలం నియోజకవర్గ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ముఖ్యంగా రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్, సాగునీటి సమస్యలతో పంటలు పండుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు .ప్రభుత్వం వెంటనే స్పందించి భద్రాచలం–వెంకటాపురం రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని, అప్పటివరకు ఇసుక లారీల రాకపోకలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే వారి పక్షాన మరిన్ని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, అంబోజి సతీష్, కుప్పాల నిరంజన్, కనుకు భద్రం, పలక రమేష్, రావుల కిషోర్, మామిడి రాజు, ఎడ్ల రామదాసు, కట్టం కన్నారావు, పాసిగంటి సంతోష్, గాదంశెట్టి కిషోర్, మెంతుల నాగరాజు, రాట్నాల శ్రీరామ్మూర్తి, కొంగూరి సోమరాజు, బట్ట కొమరయ్య, గుమ్మల నరేంద్ర, ఎలకం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రేగుంటలో ఉచిత టీబీ ఎక్స్‌రే శిబిరం

- 60 మందికి ఎక్స్‌రే పరీక్షలు
- టీబీ లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయొద్దు- డా.హారిక



**చర్ల, అక్టోబర్ 12:(ప్రజా జ్యోతి):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. హారిక ఆధ్వర్యంలో రేగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం టీబీ నిర్ధారణ కోసం ఉచిత ఎక్స్‌రే ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 60 మందికి ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీఎఫ్ క్యాంప్ డీపీసీ ఎం. కిరణ్, ఆర్. సాయి కుమార్, ఎస్. సీతారామయ్య హాజరై శిబిరం నిర్వహణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. హారిక మాట్లాడుతూ, విలువైన ఎక్స్‌రే పరీక్షల సేవలను ప్రజల వద్దకే తీసుకువచ్చినట్లు తెలిపారు. మద్యపానం, ధూమపానం చేసే వారు, టీబీ మందులు వాడుతున్నవారు వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో టీబీ చికిత్సకు అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నందున ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవద్దని అన్నారు. గ్రామ సర్పంచ్ రాజు మాట్లాడుతూ రేగుంటలో ఇలాంటి ఆరోగ్య శిబిరం నిర్వహించడం సంతోషకరమని ఈ కార్యక్రమం ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ప్రయోజనం కలిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామ్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు ధర్మారావు, సౌజన్య, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మందలపల్లి గ్రామ పరిశుభ్రతే లక్ష్యం.. సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు

- మందలపల్లి రోడ్డుకు ఇరువైపులా చెత్త తొలగింపు



**దమ్మపేట,అక్టోబర్ 12.(ప్రజాజ్యోతి):** గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రహదారిపై ప్రయాణించే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మందలపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మందలపల్లి నుంచి ఏలూరు ఆర్అండ్‌బీ రహదారికి వెళ్లే మార్గంలో ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను డోజర్ సాయంతో తొలగించారు. రహదారి పక్కన చెత్త పేరుకుపోవడంతో ఏర్పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులు నిర్వహించారు. గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్ గుజ్జుల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ చింతలపాటి మురళి, దూదిగం రాంబాబు, వార్డు సభ్యుడు మానికల సుబ్బారావు కలిసి పారిశుధ్య పనులను చేపట్టారు.

## సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కు వినతి



**ములకలపల్లి, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** రాచన్నగూడెం పంచాయతీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ మడకం విజయ భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం జగన్నాథపురం రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు వచ్చిన కలెక్టర్‌ను మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బత్తుల అంజి తో కలిసి సమస్యలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీకి రావాల్సిన నిధులు సాంకేతిక లోపాలతో నిలిచిపోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, నిలిచిపోయిన నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుని పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్‌ను కోరారు.

## దుమ్ము ధూళితో ప్రజలకు తప్పని తిప్పలు.. రోడ్డును పూర్తి చేయాలి!

- రహదారి నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవోకు వినతి




**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 12, (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతూ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము, ధూళి విపరీతంగా లేస్తున్నాయని, దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అసంపూర్తిగా ఉన్న రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో స్థానిక ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కుంజా వెంకటేష్ దొర, బీజేపీ నాయకుడు మొగిలి రామకృష్ణ పాల్గొన్నారు.

## ఇసుక క్వారీలతో దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి

- బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ డిమాండ్
- భూపతిరావుపేట, దుగినేపల్లి క్వారీల వద్ద రహదారులను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



**పినపాక, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి)** పినపాక మండల పరిధిలోని ఇసుక క్వారీల నుంచి భారీ వాహనాల రాకపోకల కారణంగా దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం భూపతిరావుపేట, దుగినేపల్లి ఇసుక క్వారీల పరిసరాల్లోని రహదారులను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు.

**ప్రజలకు తప్పని రహదారి కష్టాలు**

ఇసుక రవాణా వాహనాల రాకపోకలతో రహదారులు దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రహదారుల దుస్థితి కారణంగా వాహనదారులు, స్థానిక ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి**

ఇసుక క్వారీల ద్వారా రవాణా కొనసాగుతున్న నేపథ్యంలో రహదారుల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రహదారులను బాగు చేయడంతో పాటు, భవిష్యత్తులో రహదారులు మరింత దెబ్బతినకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, జెడ్పీటీసీ దాట్ల వాసుబాబు, ముఖ్య నాయకులు పోలిశెట్టి సత్తిబాబు, డాక్టర్ రవివర్మ, కొండేరు రాము, రాయల సత్యనారాయణ, బెడద సురేందర్, బుల్లిబాబు, గుండుం దామోదర్, శ్రీను, సర్వేశ్వరరావు, నర్సింహారావు, నరేష్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ ను రద్దు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్య దర్శి ముదిగొండ రాంబాబు



**ములకలపల్లి అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పూసుగూడెం గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఓట్ల తొలగింపునకు పాల్పడుతోందని ఆరోపించారు. సర్ పేరుతో 13 కోట్ల మంది ఓట్లను తొలగించారని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడేందుకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో అఖిలపక్షం ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలపై పారామిలటరీ బలగాలతో దాడులు చేయడం, నిరసనకారులను అరెస్టు చేయడాన్ని ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. సర్ కు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎం. రావుజా, శ్రీదేవి, వెంకటేశ్వర్లు, సామిని, వీరు, లక్య, దేవా, భీమా, జగ్గు తదితరులు పాల్గొన్నారు.

## ఒడిశా ఆదివాసీ యువతి మృతి

**ములకలపల్లి అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):**
పొట్టకూటి కోసం ఒడిశా నుంచి వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటున్న ఓ ఆదివాసీ మహిళ మృతి పలు అనుమానాలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గండిప్రోలు శివారులో ఓ ఆంధ్ర వ్యక్తికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో పూజారి సోని (31) తన బంధువులతో కలిసి మూడు నెలలుగా దినసరి కూలీగా పనిచేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం ఆమె పని చేస్తున్న చోటే పురుగుల మందు తాగినట్లు సమాచారం. గమనించిన తోటి కార్మికులు ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం.స్థానిక ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు కుటుంబ సమస్యల నేపథ్యంలో బలన్మరణానికి పాల్పడినట్ల మృతురాలి తల్లిపిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలావుండగా సోని మృతి వెనుక అసలేం జరిగిందనే అంశంపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మద్యం మత్తులో ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 12 ,(ప్రజాజ్యోతి)** పాల్వంచ పట్టణ పరిధిలోని జగ్గుతండాలో విషాదకర సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మద్యం మత్తులో క్షణికావేశంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదు ఆధారంగా... జగ్గుతండాకు చెందిన అజ్మీర శంకర్ (54) అనే మద్యానికి బానిసయ్యాడు, సోమవారం ఉదయం 10:30 గంటల సమయంలో మద్యం కోసం డబ్బులు తీసుకొని శంకర్ బయటకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో శంకర్ భార్య అజ్మీరా లక్షి , కూతురు భూక్య పద్మ లు చుట్టుపక్కల వెతికారు. అయితే తండా శివారులోని రోడ్డు పక్కన ఉన్న రావి చెట్టుపై శంకర్ తాను ధరించిన చొక్కాతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు, అటుగా వెళుతున్న స్థానికులు శంకర్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు, విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు, శంకర్ భార్య లక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పు తీర్చినా అధిక వడ్డీ పేరుతో మోటార్‌సైకిల్ తీసుకెళ్లారని ఫిర్యాదు

- దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**దమ్మపేట అక్టోబర్ 12, (ప్రజాజ్యోతి):** దమ్మపేట గ్రామానికి చెందిన షేక్ యూసఫ్ తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం షేక్ జాన్ బీ అనే మహిళ వద్ద రూ.50,000 అప్పుగా తీసుకున్నాడు. అయితే, తాను తీసుకున్న అప్పును తిరిగి చెల్లించినప్పటికీ, అధిక వడ్డీ బకాయి ఉందని, అప్పు పూర్తిగా తీర్చలేదని జాన్ బీ ప్రకాష్ అనే వ్యక్తితో కలిసి తన మోటార్‌సైకిల్‌ను బలవంతంగా తీసుకెళ్లినట్లు షేక్ యూసఫ్ దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి





- ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించండి: కలెక్టర్ అంకిత్
- రైతులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షించిన కలెక్టర్



**ములకలపల్లి, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):** ఎల్‌నినో ప్రభావంతో రాబోయే యాసంగి సీజన్‌లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉంటూ వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. మండలంలోని జగన్నాథపురం, ములకలపల్లి, పూసుగూడెం రైతు వేదికల్లో సోమవారం రైతు నేస్తం 110వ ఎపిసోడ్‌ను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. జగన్నాథపురం రైతు వేదికలో కలెక్టర్ అంకిత్ రైతులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఈసారి వర్షపాతం తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందన్నారు. భూగర్భ జలమట్టాలు కూడా తగ్గే ప్రమాదం ఉన్నందున రైతులు నీటి లభ్యతను బట్టి పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అధికంగా నీరు అవసరమయ్యే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఆయిల్‌పామ్, కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వీడియో కా న్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ ఆరుతడి పంటల సాగు వైపు మళ్లాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యానవన, జలవనరుల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కుంజా వినోద్, మడకం విజయ, అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, సహాయ వ్యవసాయ సంచాలకుడు రవికుమార్, మండల వ్యవసాయ అధికారి అరుణ్‌బాబు, తహసీల్దార్ స్వాతి బిందు,పశువైద్యాధికారి పిరామకృష్ణ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.




- 10 సంవత్సరాలు దాటుతుంది
- కొత్త పంచాయతీల నిర్మాణం పేరుకే నా?
- అన్ని పంచాయతీలకు ఒకటే పశువుల డాక్టర్ నా!

**లక్ష్మీదేవి పల్లి ,12 అక్టోబర్ ,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రంలో కొత్త పంచాయతీలు ఏర్పడి 10 సంవత్సరాలు దాటుతున్న ఇప్పటివరకు కొత్త పంచాయతీలకు ప్రత్యేక రేషన్ షాపు కేటాయించలేదు ఉమ్మడి పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి పాత రేషన్ షాపులకే రేషన్ బియ్యం తీసుకోవడానికి రావడం వల్ల ప్రజలు ఒకేసారి ఎక్కువ మొత్తంలో రావడం కొంత గడిబిడి వాతావరణం నెలకొంటుంది వృద్ధులకు దూరం నుంచి రేషన్ బియ్యం తీసుకోవడానికి చాలా ఇబ్బందిగా ఉండటం రాకపోకలకు అంతరాయం కలగడం గ్రామీణ ప్రాంతాలలో సరైన సమయంలో ప్రయాణ సౌకర్యాలు అందక చాలా ఇక్కట్లు పడతా ఉన్నారు అదేవిధంగా కొత్త పంచాయతీలో పశువుల బందే దొడ్లు ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడం కొత్త పంచాయతీల నిర్మాణం పేరుకే కనబడుతుంది కానీ పాత పంచాయతీల ఆధారంగానే పాత పంచాయతి లోనే పశువుల డాక్టర్ల దగ్గరికి వెళ్ళడం పాత పంచాయతీలోని పశువుల బందే దొడ్లు ఉపయోగించుకోవడం జరుగుతా ఉంది కొత్త పంచాయతీల పునర్నిర్మాణంలో మరింత శ్రద్ధ చూపించి వాళ్లకు కావాల్సిన అన్ని వసతులు కల్పించాలని తద్వారా మాత్రమే కొత్త పంచాయతీల పుననిర్మాణం విజయవంతంగా అయిందని అప్పుడే పంచాయతీలో స్వతంత్ర పరిపాలన అందించి వేరే పంచాయతీల మీద ఆధారపడకుండా ఉంటుందని ప్రజలు భావిస్తా ఉన్నారు